క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్లు అందజేత

చిన్నంబావి: మండలంలోని పెద్దమారు ప్రాథమికోన్నత పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలకు రత్నగిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జూపల్లి జగన్మోహన్ రావు, కన్వీనర్ కేతూరి ధర్మతేజ కంప్యూటర్లను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి అన్ని రకాల సహకారాలు అందిస్తానని హామీ ఇవ్వడంతో రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో కంప్యూటర్లను అమర్చినట్లు పేర్కొన్నారు. కన్వీనర్ ధర్మతేజ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం మంత్రి జూపల్లి రూ.25లక్షలను మంజూరు చేశారని.. త్వరలో పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. అదేవిధంగా మండలంలోని పెద్దదగడ పాఠశాలను కూడా అభివృద్ధి పరచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విద్యాసాగర్ రావు, హనుమంతురావు, మహేశ్వర్ రావు, రాజ్‌కుమార్, నరేష్, మోహన్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి

వీపనగండ్ల: కొల్లాపూర్ పట్టణంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ స్థాయి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐఏయు) ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముంత కృష్ణయ్యయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శిగా వీరబాబు, నియోజకవర్గ సంఘం కార్యవర్గ సభ్యులుగా బత్తుల రాము ఎన్నిక కావడంపై మండలంలోని జర్నలిస్టులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతనంగా ఎంపికైన వారు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ఆత్మకూర్: స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రక్తదానం శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని సేవాసమితి అధ్యక్షుడు బాలు కోరారు. రక్తదానంతో ఒకరికి ప్రాణదానం చేసిన వారవుతారని, సేకరించిన రక్తం తలసేమియా రోగులకు వినియోగిస్తారన్నారు. రక్తదానం చేయదలచిన వారు 98484 56391 నంబరుకు సంప్రదించాలని కోరారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



వీపనగండ్ల: మూడు రోజుల పాటు మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభల ముగింపు రోజైన మంగళవారం జిల్లా కార్యదర్శిగా వనపర్తి పట్టణానికి చెందిన పుట్ట ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుగా ఎండీ జబ్బార్, బాల్‌రెడ్డి, జీఎస్ గోపి, లక్ష్మి, రాజు, జిల్లా కమిటీ సభ్యులుగా మేకల ఆంజనేయులు, కృష్ణయ్య, మహబూబ్‌పాషా, బాల్యానాయక్, వెంకటయ్య, ఎస్ రాజు, వెంకటేష్, రమేష్, పరమేశ్వరాచారి, ఆది, వెంకటరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడతామన్నారు.

గదులను పూర్తిచేయాలి

కోడేరు: ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా నిర్మించిన గదులను వెంటనే పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిర్మించారన్నారు. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణ పనులను ప్రారంభించాలన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

యూనిఫాం పంపిణీ చేయాలి

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత యూనిఫామ్స్‌ను పంపిణీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలు తెరచి ఆరు నెలల కావొస్తున్నా ఇప్పటికీ విద్యార్థులకు యూనిఫామ్స్ ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి యూనిఫామ్స్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

పెద్దకొత్తపల్లి: మండలంలోని వెనచర్ల ఉన్నత పాఠశాలలో 1997–98వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థి నాగపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్యకు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు రూ.7వేలు ఆర్థికసాయం అందజేశారు. సుధాకర్‌రెడ్డి, కే భాస్కర్‌రెడ్డి, డి రాజు, కే నలేశ్వరం, ఆంజనేయులు, వెంకటేష్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



మనిగిళ్లలో కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి రూరల్: వరి కొనుగోలు కేంద్రాల్లో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కలెక్టర్ ఆదర్శ సురభి అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని చిమనగుంటపల్లిలో పీఏసీఎస్, చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలించడంతో పాటు తాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎఫ్ఏ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. పీపీసీ ఇంచార్జీలు సన్న రకం ధాన్యాన్ని గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసి తర్వాత నగదు చెల్లింపులు త్వరగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చిట్యాల శివారులో ఉన్న గోదాంలను సందర్శించి ధాన్యం నిల్వ చేయడానికి ఎంత మేర ఖాళీ స్థలం ఉందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి కాశీవిశ్వనాథ్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, పీపీసీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పెద్దమందడి మండలంలోని మనిగిళ్లలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు మ్యాచర్ వచ్చిన వెంటనే తూకం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 అందిస్తుందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. మండలంలోని అప్పరాల, విలియంకొండ, మిరాసిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు వాసుదేవారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమది రైతు పక్షపాత ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాథమిక సహకార సంఘం అధికారి ప్రసాద్‌రావు, మానిటరింగ్ అధికారి శ్రీనివాసులు, సీఈవో రాఘవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు దేశి వెంకటయ్య, డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, గిన్నె శ్రీనివాస్‌రెడ్డి, నీలవర్ధన్‌రెడ్డి, చెంద్రాయుడు, మొగులన్న, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బీచుపల్లియాదవ్, మాజీ సర్పంచ్ మాసన్న తదితరులు ఉన్నారు.

అమరచింత: రైతులను ఆదుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని డైరెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, పీఏసీఎస్ సీఈఓ నరేష్, మాసన్న, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నాయకులు తిరుమలేష్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అప్పరాలలో..



చిట్యాలలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ సురభి



అమరచింతలో..

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



మాట్లాడుతున్న సీపీఐ పట్టణ అధ్యక్షులు రమేష్

వనపర్తి రూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని, వేగం పెంచాలని సీపీఐ పట్టణ కార్యదరిశ రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లాలో సన్న, దొడ్డు రకం కొనుగోలుకు 319 కేంద్రాలను తెరవాలని జిల్లా అధికారులు నిర్ణయించారన్నారు. ఇప్పటి వరకు 235 కొనుగోలు కేంద్రాలను మాత్రమే తెరిచారని ఇంకా 84 కేంద్రాలను ప్రారంభించాల్సి ఉందన్నారు. 235 కేంద్రాలను తెరిచినప్పటికీ కేవలం ఎనిమిది కేంద్రాల్లో మాత్రమే ధాన్యం కొనుగోలు ప్రారంభించినట్లు వారు పేర్కొన్నారు. ఖాళీ సంచులు, టార్పాలిన్లు, పాడి క్లినర్లు, సన్నవడ్లు గుర్తించే మిషన్లు కేంద్రాలకు రాలేదని రైతులు చెబుతున్నారన్నారు. గ్రామాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లపై ఆరబోస్తే పోలీసులు కేసులు పెడుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో కళావతమ్మ, జయమ్మ, చిన్న కుర్మయ్య పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ: కేసు నమోదు

పాన్‌గల్: గుర్తుతెలియని వ్యక్తులు మండల కేంద్రంలోని ఓ ఇంటి తాళం పగలగొట్టి చోరీ చేసిన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంగళాయిపల్లికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ బండి ఆంజనేయులు మంగళవారం మధ్యాహ్నం వ్యవసాయ పొలానికి వెళ్లగా ఇంట్లో ఉన్న అతడి భార్య మంజుల ఇంటికి తాళం వేసి పక్కింటికి వెళ్లారు. కొద్దిసేపు తర్వాత వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించిన ఆమె భర్తకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఇంటికి వచ్చిన ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని అలుమారను పగులగొట్టి అందులో ఉన్న నాలుగు బంగారు ఉంగరాలు (రెండు తులాలు), రూ.50 వేల నగదు కనిపించలేదని తెలిపారు. ఎవరో ఈ ఘటనపై బండి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంపౌడ్ వాల్ నిర్మాణం కూల్చివేత

వనపర్తి టౌన్: చిట్యాల రోడ్డు మిట్టపై ఉన్న మారం సతీష్ మిల్లు వెనకాల ఉన్న కాంపౌడ్ వాల్‌ను రెండు రోజులుగా పుర అధికారులు యంత్రాల సహాయంతో నేలమట్టం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం క్షేత్ర స్థాయిలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతోనే కూల్చేస్తున్నామని, రెండు నోటీసులు ఇచ్చిన పట్టించుకోకపోవడంతో కాంపౌడ్‌వాల్‌ను తొలగించామని తెలిపారు. కాంపౌడ్‌వాల్‌కు అనుమతి అవసరం లేనప్పుడు పెద్ద పెద్ద పిల్లర్లు తీశారని, తమకు అందిన ఫిర్యాదు మేరకు నిబంధనలు పాటించకపోవడం వల్లే కూలగొట్టామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. యాజమాని మారం సతీష్ మాట్లాడుతూ ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ పాలక పెద్దలు కక్ష్యపూరితంగా తన కాంపౌడ్‌వాల్‌ను కూలగొడుతున్నారని ఆరోపించారు.

రెండో ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి



పాన్‌గల్ పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

పాన్‌గల్: రెండో ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ వయస్సు పైబడిన వారికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలని, వయస్సు రీత్యా పరీక్ష రాసే అర్హత లేని వారికి వంద శాతం గ్రాస్ శాలరీని అమలు చేయాలని, రూ.పది లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఇతర రాష్ట్రాల్లో ఎటువంటి పరీక్షలు లేకుండా రెగ్యులర్ చేస్తున్నారని అన్నారు. డిపార్టుమెంట్ పరీక్ష ద్వారా నియమకాలు చేపట్టేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుమిత్ర, వసంత, సరళ, శాంత, నిర్మల, నాగేశ్వరి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి స్థల పరిశీలన



పెద్దకొత్తపల్లి: వెనచర్ల నుంచి గన్యాగుల వరకు 4 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం కోసం పంచాయతీరాజ్ శాఖ ఏఈ సాయిరాం, మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌లు మంగళవారం స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.3.40 కోట్ల నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. రోడ్డు సర్వే పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, రవికుమార్, వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, పర్వతాలు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సంపూర్ణంగా సహకరించాలి



అమరచింతలో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్



గుంటిపల్లిలో..



పెద్దగూడెంలో..

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం మండలంలోని గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి బీరం సుబ్బారెడ్డి, తహసీల్దార్ చాంద్‌పాష, ఎంపీడీఓ సుజాత, ఎంపీఓ శ్రీరాంరెడ్డి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు.

పాన్‌గల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు దొటు చేసుకోకుండా పకడ్బందీగా వివరాలు సేకరించాలని తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీఓ గోవింద్‌రావు ఎన్యుమరేటర్లకు సూచించారు. సర్వేలో భాగంగా మంగళవారం పాన్‌గల్‌లో తహసీల్దార్, దావాజిపల్లి, చింతకుంట, దొండాయిపల్లి గ్రామాల్లో ఎంపీడీఓ గోవింద్‌రావు పర్యటించి సర్వే వివరాలను పరిశీలించారు. మండలంలోని 28 జీపీల్లో 1,185 ఇళ్ల నుంచి వివరాలను సేకరించినట్లు వారు పేర్కొన్నారు.

వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లి, పెద్దగూడెం గ్రామాల్లో సర్వే వివరాలను ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ రవీంద్రబాబు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జున, మద్దిలేటి పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని సింగంపేట, నాగల్‌కడ్మూర్ గ్రామాలతో పాటు మున్సిపాలిటీలోని వివిధ బ్లాక్‌ల్లో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటున్న తీరును తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ రెడ్యానాయక్, ఆర్ఐ గోపాల్, ఎంపీఓ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, షాపురం గ్రామాల్లో తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి పర్యటించి సర్వేను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ఎన్యూమరేటర్లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించినట్లు వారు తెలిపారు. మండలంలో మొత్తం 77 మంది ఎన్యూమ రేటర్లు ఉండగా అందులో 22 మంది పర్యవేక్షకుల ద్వారా వివరాలు సేకరిస్తున్నామన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండలంలోని శాగాపూర్ ప్రాథమిక పాఠశాలను మానిటరింగ్ టీమ్‌తో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం వివరాల రిజిస్టర్, అకాడమిక్ పరమైన అన్ని రిజిస్టర్లను వారు పరిశీలించారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు బోధనోపకరణాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటస్వామి, సీఆర్పీలు గోవింద్‌నాయక్, రమాదేవి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బీపీ చెకప్ చేసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు. వనపర్తి, ఆత్మకూర్‌కు చెందిన ప్రభుత్వ వైద్యులు శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. బీపీ, షుగర్‌తో పాటు వెన్నునొప్పులు, కండరాల నొప్పులతో పాటు పలు రకాల జబ్బులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు సంక్రీత్, వంశీకిరణ్, అనిల్, ఉపేందర్ కుమార్, కల్పన, సునీత, నిర్వాహకులు స్మార్ట్‌డాక్స్ బిజినెస్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన హెచ్‌ఆర్ శృతి, ఆనంద్, హరీశ్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్



ఎర్రవల్లిలో పోటీలు ప్రారంభిస్తున్న కమాండెంట్ తదితరులు

ఎర్రవల్లి: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరికి క్రీడలపై మక్కువ ఉండాలని పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ అన్నారు. మంగళవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీని ముఖ్య అతిథులుగా హాజరై వారు ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీర ధృడత్వం, ఫిజికల్ ఫిట్నెస్ సాధించవచ్చన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప, అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, జోగుళాంబ ఆలయ డైరెక్టర్లు నాగ శిరోమణి, జోగుల సరస్వతి, మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, కుమార్, రాము, లక్ష్మన్న, గోపాల్, రాజ్‌కుమార్, రాజు, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే కాంగ్రెస్‌లో చేరికలు



కనిమెట్టలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలతో జి.కవిత

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత అన్నారు. మండలంలోని కనిమెట్టలో మంగళవారం వివిధ పార్టీలకు చెందిన వారు 100మందికి పైగా మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరుతున్న వారికి ఎమ్మెల్యే సతీమణి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తుందన్నారు. గడిచిన 10ఏళ్లలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే ఇచ్చిన ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. సీఎం ఆశీర్వాదంతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి నియోజవర్గానికి ఎన్నో నిధులు తీసుకొస్తున్నారని, అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో రోజురోజుకూ పెరుగుతున్న అభిమానాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేస్తున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, మేస్త్రీ శ్రీనివాసులు, చర్లపల్లి తాజా మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డి, బీచుపల్లియాదవ్, మిషేక్, ముజీబ్, హరినాథ్‌రావు ఉన్నారు.

తాగునీటి కుళాయి గదికి తాళం



తాళం వేసిన ఉన్న గది



గదిలో ఏర్పాటు చేసిన కుళాయిలు

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయిల గదికి తాళం వేసి ఉండటంతో విద్యార్థులు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గతంలో మాజీ జెడ్పీటీసీ తన నిధులు రూ.లక్ష కేటాయించి విద్యార్థులకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. అవి కాస్తా మరమ్మతుకు గురికావడంతో ప్రస్తుతం ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరైన నిధులతో కుళాయిల మరమ్మతుతో పాటు వాటి చుట్టు రక్షణ కోసం గది నిర్మించారు. పాఠశాల సమయంలో కుళాయి గదిని తెరిచి నీటి వసతిని కల్పించాలి. కాని కుళాయి గదికి తాళం వేసి ఉంచడంతో పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పాఠశాల సమయంలో తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి వసతిని కల్పించాలని కోరుతున్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు రూరల్: మండలంలోని అయ్యవారిపల్లిలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాటి నుంచి కాపాడాలంటూ గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీఓలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. గ్రామంలో వీధి కుక్కల బెడద కారణంగా ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తుందని, ఇంట్లో చిన్నపిల్లలను వదిలి ఎక్కడికైనా వెళ్తే కుక్కలు ఏం చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నామని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలోని పాఠశాలకు చిన్నారులు వెళ్లాలంటే భయపడుతున్నారని, రోడ్డుపై బైక్‌తో వెళ్తున్న వారిని సైతం కుక్కలు వదలటం లేవన్నారు. కుక్కల వలన ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని కుక్కలను శివారు ప్రాంతాలకు తరలించాలని వేడుకుంటున్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ముత్త లక్ష్మణ్, బాలరాజు, భాస్కర్, బాలకృష్ణ, శ్రీకాంత్, నవీన్ ఉన్నారు.